ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
బుధవారం 21 ఆగస్టు 2024



రుణమాఫీ కానివారికి భరోసా



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రుణమాఫీ కాలేదని ఆందోళన చెందుతున్న పలువురు రైతులకు ప్రభుత్వం భరోసా కల్పిస్తున్నది. వివిధ సాంకేతిక కారణాల వల్ల రుణమాఫీకి నోచుకోని రైతులు ఈనెలాఖరు లోగా నిర్ణీత దరఖాస్తు ఫారంలో వివరాలు నమోదు చేసిస్తే రుణమాఫీ వర్తింపజేసేందుకు చర్యలు తీసుకుంటామని ప్రకటించింది. ఈమేరకు కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రంలో, మండలాల్లో మండల వ్యవసాయ శాఖాధికారులు, మండల విస్తీర్ణాధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఆగస్టు 15వ తేదీ నాటికి 2 లక్షల రూపాయల వరకు రుణ మాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు మూడు విడతల్లో రుణ మాఫీ చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం 2018 డిసెంబరు 12వ తేదీనుంచి 2023 డిసెంబరు 9వ తేదీవరకు తీసుకున్న పంట రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించింది. ఒక కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు అంతకంటే ఎక్కువ మంది పంట రుణాలు తీసుకున్నా, 2 లక్షలు మాత్రమే రుణ మాఫీ చేస్తామని, కుటుంబ సభ్యుల వివరాలను రేషన్‌కార్డుల ఆధారంగా గుర్తించారు. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన పోర్టల్‌లో ఉన్న వివరాల ఆధారంగా ఆదాయ పన్ను చెల్లించే రైతులను గుర్తించి వారికి రుణ మాఫీ చేయనట్లు తెలుస్తున్నది. ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న వారిని కూడా రుణ మాఫీ పథకం నుంచి తొలగించారు. కొన్ని నిబంధనల వల్ల నిర్ణీత కాల వ్యవధిలో రుణాలు తీసుకున్న రైతులకు పంట రుణాలు మాఫీ కాలేదు. గత ఏడాది పంట రుణాలు తీసుకుని రుణమాఫీ విషయం తెలియక ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో అప్పులు చెల్లించి కొత్తగా రుణాలు తీసుకున్న రైతులకు కూడా రుణ మాఫీ వర్తింపజేయకపోవడంతో సదరు రైతులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. తాము తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించడమే తాము చేసిన నేరమా అని సదరు రైతులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.

- వివిధ కారణాల వల్ల 17 వేల మందికి కానీ రుణమాఫీ
- సరైన వివరాలతో దరఖాస్తులకు నెలాఖరు వరకు అవకాశం
- 2 లక్షలకు పైగా ఉన్నవారు ఆపై సొమ్ము చెల్లిస్తేనే మాఫీ..



గర్రెపల్లిలో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏఈవో

● జిల్లాలో రూ. 375.58 కోట్ల రుణాల మాఫీ..

జిల్లాలో మూడు విడతల్లో కలిపి మొత్తం 51,393 మంది రైతులకు 375 కోట్ల 58 లక్షల 4 వేల 931 రూపాయలు మాఫీ చేశారు. మొదటి విడతలో లక్ష రూపాయల వరకు 29,724 మంది రైతులకు 149 కోట్ల 42 లక్షల 22 వేల 297 రూపాయలు మాఫీ కాగా, రెండో విడతలో లక్షన్నర వరకు 13,401 మంది రైతులకు 124 కోట్ల 40 లక్షల 76 వేల 460 రూపాయలు, మూడో విడతలో రెండు లక్షల వరకు 8,268 మంది రైతులకు 101 కోట్ల 75 లక్షల 6 వేల 174 రూపాయలు, 2 లక్షలకు పైగా రుణాలు పొందిన రైతులు 2 లక్షల పైన ఉన్న మొత్తాన్ని బ్యాంకుల్లో చెల్లిస్తే వారి ఖాతాల్లో 2 లక్షల రుణ మాఫీ సొమ్మును జమ చేస్తామని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సోమవారం ప్రకటించారు. ఆధార్ వివరాలు సరిగా లేకపోవడం, రేషన్ కార్డులు లేని వారికి, వివిధ రకాల తప్పులు ఉన్న రైతులకు అర్హత కలిగి ఉన్నా కూడా రుణ మాఫీ కాలేదు. దీంతో సదరు రైతులు ఆందోళన చెందుతున్నారు. బ్యాంకుల చుట్టూ, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అలాంటి రైతులకు ప్రభుత్వం ఊరట కల్పించింది. ఈ నెలాఖరులోగా నిర్ణీత ఫారంలో అన్ని వివరాలతో దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించి రుణ మాఫీ చేస్తామని ప్రకటించింది. ఆ మేరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నారు.

● రుణమాఫీ కాని వారు 17 వేల మంది..

ప్రభుత్వం జారీ చేసిన రుణ మాఫీ మార్గదర్శకాల ప్రకారం అన్ని అర్హతలు ఉండి వివిధ కారణాల వల్ల రుణ మాఫీ కాని వారు జిల్లాలో 17 వేల మంది వరకు రైతులు ఉండవచ్చని అంచనా. వారికి సంబంధించిన మేరకు 242 కోట్ల 85 లక్షల 30 వేల 317 రూపాయలు ఉంటుందని అంచనా. ఇప్పటికే వ్యవసాయ శాఖ అధికారులకు దాదాపు 3 వేల దరఖాస్తులు అందాయి. పెద్దపల్లి మండలంలో 3037 మంది, ఎలిగేడు మండలంలో 1030 మంది, జూలపల్లి మండలంలో 536 మంది, ఓదెల మండలంలో 958 మంది, కాల్వశ్రీరాంపూర్ మండలంలో 1060 మంది, సుల్తానాబాద్ మండలంలో 1942 మంది, కమాన్‌పూర్ మండలంలో 578 మంది, మంథని మండలంలో 3,104 మంది, ముత్తారం మండలంలో 477 మంది, రామగిరి మండలంలో 690 మంది, అంతర్గాం మండలంలో 134 మంది, పాలకుర్తి మండలంలో 718 మంది, రామగుండం మండలంలో 461 మంది రైతులు ఉన్నట్లు బ్యాంకు అధికారులు గుర్తించినట్లు సమాచారం. సంబంధిత రైతులు త్వరగా వ్యవసాయ శాఖాధికారులకు దరఖాస్తు చేసుకున్నట్లయితే వారికి రుణమాఫీ అయ్యే అవకాశాలు ఉన్నాయి.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌రెడ్డి

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలి

- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

పెద్దపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన కట్టుదిట్టంగా సకాలంలో పూర్తిచేయాలని, అవసరమైతే అదనపు సిబ్బందిని తాత్కాలికంగా నియమించాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ ఆదేశించారు. మంగళవారం ఆయన ఖమ్మం కలెక్టరేట్ నుంచి, హైదరాబాద్ సచివాలయం నుంచి రాష్ట్ర సీఎస్ శాంతికుమారి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఎల్ఆర్ఎస్, భారీ వర్షాలు, ధరణి, ఆర్‌వోఆర్ చట్టంపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ సంబంధించి దాదాపు 20 లక్షలకుపైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం దరఖాస్తులను పరిశీలించాలన్నారు. వీటిపై కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ చూపించి సకాలంలో పూర్తిచేయాలని, అవసరమైతే జిల్లాలో అదనపు సిబ్బందిని తాత్కాలిక ప్రాతిపదికన నియమించాలని మంత్రి సూచించారు. రాబోయే ఐదు రోజుల పాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని, నీటి వనరుల నిర్వహణ సమర్థవంతంగా ఉండాలన్నారు. ధరణి పోర్టల్‌లో పెండింగ్ ఉన్న దరఖాస్తుల పరిశీలన పూర్తిచేసి పరిష్కరించాలని, తిరస్కరించే దరఖాస్తులకు సదురు కారణాలు తెలియజేయాలన్నారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నూతన ఆర్‌వోఆర్ చట్టం ముసాయిదా బిల్లు ప్రతిపాదించిందని, దీనిపై జిల్లాలలో ఈనెల 23, 24 తేదీల్లో వర్క్‌షాప్ నిర్వహించి, ముసాయిదా బిల్లులో చేయాల్సిన మార్పులు, మెరుగైన సూచనలు ఏవైనా ఉంటే ఫీడ్ బ్యాక్ రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి అందజేయాలని మంత్రి సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ, ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్

ప్రభుత్వ ఆస్తుల సంరక్షణకు పటిష్ట చర్యలు

పెద్దపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న ప్రభుత్వ ఆస్తుల సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించుకొని ప్రస్తుతం ఏదైనా నిర్మాణాలు జరుగుతూ ఉంటే వాటిని తొలగించాలని ఆదేశించారు. అన్నిశాఖలకు సంబంధించిన ప్రభుత్వ ఆస్తులను పూర్తిస్థాయిలో సంరక్షించాల్సిన బాధ్యత ఉంటుందని, జిల్లాలోని ప్రభుత్వ ఆస్తులలో బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. చెరువులు కుంటలు నీటి వనరుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లను నిర్దేశించి వాటిలో నిర్మాణాలు జరగకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డీసీపీ ఎం చేతన, పెద్దపల్లి, మంథని ఆర్డీవోలు బి గంగయ్య, వి హనుమానాయక్, డీపీఓ ఆశాలత, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి కే.శ్రీనివాస్, సహాయ సంచాలకులు సర్వే ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాసులు ఈఈ పంచాయతీరాజ్ గిరీష్‌బాబు, కలెక్టరేట్ ఈ విభాగం సూపరింటెండెంట్ ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు

దివ్యాంగులకు చేయూతనివ్వాలి : డీఈవో

పెద్దపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సమాజంలో దివ్యాంగ పిల్లలకు పౌరులందరూ చేయూతనిచ్చి వారిలో మానసిక స్థైర్యం నింపాలని డీఈవో డి మాధవి విజ్ఞప్తి చేశారు. సమగ్ర శిక్ష పెద్దపల్లి, భారత కృత్రిమ అవయవాల నిర్మాణ సంస్థ(అలిమ్కో) సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఉపకరణాల గుర్తింపు శిబిరాన్ని అమర్‌చంద్ కల్యాణ మండపంలో ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని 18 సంవత్సరాలలోపు దివ్యాంగ బాలబాలికలకు కావలసిన ఉపకారణాల గుర్తింపు ఈ శిబిరంలో జరుగుతుందని, ఈ సౌకర్యాన్ని వినియోగించుకొని ఉపకరణాలు పొందాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని గుర్తించిన 122 దివ్యాంగులలో 48మంది వినికిడి లోపం, 34మంది దృష్టిలోపం, 10మంది మానసిక వైకల్యం, 24మంది శారీరక దివ్యంగులు శిబిరంలో నమోదు చేసుకున్నారు. ముంబై నుంచి వచ్చిన డాక్టర్ల బృందం ఆధ్వర్యంలో శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహిత విద్య సమన్వయకర్త అజీమ్‌దాబీర్, మండల విద్యాశాఖ అధికారి రాజయ్య సమగ్ర శిక్ష సమన్వయకర్తలు, ఐఈఆర్‌పీలు, స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలి

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 20: జిల్లాలోని అర్హులైన దివ్యాంగ విద్యార్థులు ఉన్నత విద్యకు జాతీయ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు సకాలంలో సమర్పించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఒక ప్రకటనలో తెలిపారు. మహిళాశిశు దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ కింద దివ్యాంగుల సాధికారత విభాగం ద్వారా జాతీయ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో దివ్యాంగుల ఉన్నత విద్యకు మూడు రకాల స్కాలర్‌షిప్‌లు అందించడం జరుగుతుందని, 9, 10వ తరగతి విద్యార్థులకు ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్, ఇంటర్‌నుంచి పీజీ వరకు పోస్ట్ మెట్రిక్ స్కాల ర్‌షిప్, గ్రాడ్యుయేషన్/పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిగ్రీ లేదా డిప్లమా కోసం టాప్‌క్లాస్ ఎడ్యుకేషన్ స్కాలర్‌షిప్ అందిస్తామన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు కళాశాలలో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులు 2024-25 విద్యాసంవత్సరానికి ప్రీమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్, టాప్ క్లాస్ ఎడ్యుకేషన్ స్కాలర్‌షిప్ నూతన లేదా రెన్యువల్ దరఖాస్తులు స్కాలర్‌షిప్.గోవ్.ఇన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. దివ్యాంగ విద్యార్థినీవిద్యా ర్థులు తమ దరఖాస్తులు సమర్పించేందుకు ప్రీ మెట్రిక్స్ స్కా లర్‌షిప్ కోసం ఆగస్టు 31 నుంచి పోస్ట్ మెట్రిక్, టాప్ క్లాస్ ఎడ్యుకేషన్ కోసం అక్టోబరు 31 వరకు గడువు ఉందన్నారు. వివరాల కోసం జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం సమీకృత కలెక్టరేట్ రూమ్ నంబర్ 114లో నేరుగా లేదా సెల్ నంబర్ 9440852495లో సంప్రదించాలని తెలిపారు.

దోమల నివారణపై అవగాహన

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 20: ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా మంగళవారం కలెక్టరెట్ కార్యాలయంలో నివారణపై అవగాహన కల్పించారు. వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు మాట్లాడుతూ దోమలను గుడ్డు, లార్వా దశలోనే నివారించడం సులువు అవుతుందన్నారు. ఇంటి పరిసరాల్లో టైర్లు, కొబ్బరిచిప్పలు, ఖాళీ సీసాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ కిరణ్, రావుఫ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- ప్రతీవారం డ్రై డే అమలుచేయాలి - కలెక్టర్ కోయ శ్రీహర్ష



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్

సుల్తానాబాద్, ఆగస్టు 20: గ్రామాల్లో పారిశుధ్య పనుల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, అంతటా వీధిలైట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను అదేశించారు. మంగళవారం కలెక్టర్ సుల్తానాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, మొక్కల పెంపకం తదితర అంశాలపై అదనపు కలెక్టర్ జే అరుణశ్రీతో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడా వర్షం నీరు నిలువ ఉండకుండా చూడాలని, దోమల నివారణకు ఆయిల్ బాల్స్ ఉపయోగించాలని సూచించారు. జ్వరాలు ఎక్కువ ఉన్న గ్రామాల్లో మెడికల్ క్యాంప్‌లను ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన చోట వీధిదీపాలు ఏర్పాటుచేయాలని, పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యమివ్వాలని, ప్రతీ శుక్రవారం డ్రై డే నిర్వహించాలని, డెంగ్యూ కేసులు గుర్తించిన పరిసర ప్రాంతాల్లో ఫీవర్ సర్వే పకడ్బందీగా చేయాలన్నారు. గ్రామాల్లో సరఫరా చేసే తాగునీటి నాణ్యతను పక్కాగా పరీక్షించాలని సూచించారు. వనమహోత్సవం ద్వారా నాటుతున్న మొక్కలను సంరక్షించుకోవాలని, ఇందులో అందరినీ భాగస్వాములను చేయాలన్నారు. పలు గ్రామాల్లో తాగునీటి ట్యాంకుల ఆవశ్యకతత గురించి అధికారులు కలెక్టర్ దృష్టికి తేగా వాటిని మంజూరు చేస్తానన్నారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేకాధికారి, జిల్లా ఉద్యానవన అధికారి జగన్మోహన్‌రెడ్డి, ఎంపీడీవో దివ్యదర్శన్ రావు, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, సీడీపీవో కవిత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలందించాలి..

జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. మంగళవారం సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. నార్మల్ డెలివరీలు ఎక్కువగా జరిగేలా గ్రామ స్థాయిలో తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రిల్లో ఉన్న ఆధునిక వసతి సౌకర్యాలు, నిపుణులైన వైద్యులు ఉన్న విషయాన్ని అవగాహన కల్పించాలని, వైరల్ జ్వరాల తీవ్రతను ఆరాతీశారు. సుల్తానాబాద్, జూలపల్లి, ఏలిగేడు, ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాలకు చెందిన డెలివరీ కేసులు సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో అయ్యే విధంగా చూడాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎక్కువ డెలివరీలు అయ్యే విధంగా తగిన ప్రణాళికలు చేపట్టి అమలు చేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులు చేరడానికి, డెలివరీ చేయడానికి అవసరం ఉన్న పరికరాల కోసం ప్రతిపాదనలు పంపించాలని, అలాగే ఆస్పత్రికి అవసరం ఉన్న ప్రతీ విషయంలో తనను సంప్రదించాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా డీసీహెచ్ డాక్టర్ శ్రీధర్, జిల్లా మాతా శిశు ప్రోగ్రాం ఆఫీసర్, డాక్టర్ వాణిశ్రీ, మెడికల్ సూపరింటెంట్ డాక్టర్ రమాదేవి, సుల్తానాబాద్ డాక్టర్లు మహేందర్, సరిత, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనుదీప్ తో పాటు ఆయా మండలాల ప్రభుత్వ డాక్టర్లు, మెడికల్ ఆఫీసర్లు, వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేస్తాం..

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 20: అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ చేసి తీరుతామని, ప్రతిపక్షాల అసత్య ప్రచారాలు రైతులు నమ్మొద్దని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు స్పష్టం చేశారు. జిల్లాకేంద్రంలో మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నామని, రూ.2 లక్షలు రుణమాఫీ దేశ చరిత్రలో ఇదే మొదటిసారి అని పేర్కొన్నారు. బ్యాంకుల్లో చిన్నచిన్న పొరపాట్లు, సాంకేతిక కారణాలతో ఇంకా కొంత మందికి రుణమాఫీ కాలేదని తమ ప్రభుత్వం అర్హులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ చేసి తీరుతుందని భరోసా ఇచ్చారు. రుణమాఫీ కానివారి కోసం రైతు వేదికల్లో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశామని, ఈ నెలాఖరు వరకు ఫిర్యాదులు స్వీకరిస్తామని, వాటిని పరిశీలించి అర్హులైన రైతులకు రుణమాఫీ వర్తింపజేస్తామన్నారు. బ్యాంకుల్లో తలెత్తిన సమస్యలను సరిచేస్తూ అర్హులైన రైతులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. రుణమాఫీతో కాంగ్రెస్‌కు పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలు చేస్తున్నాయని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో 4 విడతల్లో చేసిన అరకొర రుణమాఫీ బ్యాంకుల్లో వడ్డీలకే సరిపోలేదన్నారు. బీఆర్ఎస్, బీజేపీ బూటకపు మాటలు రైతులు నమ్మొద్దని సూచించారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టి, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పాతాళంలో పడవేసిందని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు కొన్నిచోట్ల రైతుల ముసుగులో రుణమాఫీపై ఆందోళనలకు పాల్పడుతున్నారని వారికి రైతులే తగిన బుద్ధి చెప్తారన్నారు. రుణమాఫీపై తోడు దొంగలైన కేటీఆర్, హరీష్‌రావులు అబద్ధాలతో పోటీపడి ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ నల్లచట్టాలను తీసుకువచ్చి రైతుల ప్రాణాలను బలి తీసుకుందని విమర్శించారు. బీజేపీ అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలో రుణమాఫీ చేయలేదన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో ఇప్పటివరకు 27,471మంది రైతులకు రూ.192 కోట్ల 95లక్షలు రుణమాఫీ జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నయ్యగౌడ్, సారయ్యగౌడ్, నూగిల్ల మల్లయ్య, మస్రత్, అక్బర్‌అలీ, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మడ్డి ఎల్లయ్యను అరెస్టు చేయాలి

- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు మధు

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 20: దళిత కార్మిక నాయకురాలు స్వప్నను కులం పేరుతో దూషించిన ఏఐటీయూసీ నాయకుడు మడ్డి ఎల్లయ్య, అతని అనుచరులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతో పాటు హత్యాయత్నం కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బొంకూరి మధు డిమాండ్ చేశారు. మంగళవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళిత కార్మికురాలిపై మడ్డి ఎల్లయ్య దాడి చేసినా ఇప్పటి వరకు సీతారామయ్య, కూనంనేని సాంబశివరావు పట్టించుకోకపోవడం దురదృష్టకరమని, ఏఐటీయూసీకి కోల్‌బెల్ట్‌లో కార్మికుల్లో మంచి పేరు ఉన్నప్పటికీ ఎల్లయ్య ఆ పేరును చెడగొడుతున్నారని, ఎల్లయ్య తన కొడుకుతో పాటు అనుచరులతో స్వప్నను కులం పేరుతో బూతులు తిడుతూ దాడి చేశారన్నారు. మడ్డి ఎల్లయ్య తన తప్పు కప్పిపుచుకోవడానికి సోషల్ మీడియాలో తన అనుచరులతో తప్పుడు ప్రచారం చేస్తున్నాడని, దీనిపై ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు స్పందించకపోతే వారిపై ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సీతారామయ్య అండ చూసుకుని రామగుండంలో అరాచకాలకు పాల్పడుతున్న మడ్డి ఎల్లయ్య, అతని అనుచరులపై చర్యలు తీసుకొని పోలీసులు కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో మామిడిపెల్లి బాపయ్య, కొంకటి లక్ష్మణ్, గడ్డల శశిభూషణ్, కల్వల సంజీవ్, మహేందర్, నర్సింగారావు, సురేష్, సమ్మయ్య, రవి, రాయలింగు, మురళి తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బొంకూరి మధు

డీసీఎస్‌వో ప్రేమ్ కుమార్ బదిలీ

పెద్దపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి ఏ ప్రేమ్ కుమార్ మహబూబాబాద్ జిల్లాకు బదిలీ చేస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆయన స్థానంలో ఇక్కడికి మహబూబాద్ జిల్లాలో పని చేస్తున్న బి రాజేందర్ రానున్నారు. ఇదే శాఖలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న రవీందర్ రాథోడ్‌ను ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ చేయగా, ఆయన స్థానంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పని చేస్తున్న కె వెంకటేష్‌ను జిల్లాకు బదిలీ చేశారు.

నేడు పలు అభివృద్ధి పనులకు మంత్రి శ్రీధర్‌బాబు శంకుస్థాపన

మంథని, ఆగస్టు 20: మంథనిలో మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా వివిధ అభివృద్ధి పనులు బుధవారం చేపట్టనున్నట్లు పీఏ ఆకుల చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్ ప్రారంభం, డాక్టర్లతో రివ్యూ మీటింగ్, 11.30 గాంధీచౌక్‌లో 13 వార్డుల్లో 13.95 కోట్ల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన, 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి మున్సిపాలిటీకి మంజూరైన స్వచ్ఛ ఆటోల ప్రారంభం, మహిళా షాపుల ప్రారంభం, మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ చెక్కుల పంపిణీ, విద్యార్థులకు బహుమతి ప్రదానం చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ప్రమాదాల నివారణకు చర్యలు : ఏసీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 20: రోడ్ జంక్షన్ల అభివృద్ధి, ట్రాఫిక్ సిగ్నల్స్, సీసీ కెమెరాల ఏర్పాటు, థర్మోప్లాస్టిక్ పెయింటింగ్‌లు, సైనేజీ బోర్డుల ఏర్పాటు, రోడ్డు ఆక్రమణల తొలగింపుపై మంగళవారం వివిధ శాఖలతో సమన్వయ సమావేశం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ గజ్జి కృష్ణ మాట్లాడుతూ స్థానిక సంస్థల సహకారంతో రోడ్డు ప్రమాదాల నివారణపై చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వాహనదారులకు ట్రాఫిక్ అంతరాయం కలిగే విధంగా రోడ్డు ఆక్రమణల చేసిన వాటి తొలగింపు, జాతీయ రహదారులపై వేగాన్ని నియంత్రించనున్నట్లు తెలిపారు. జంక్షన్ల వద్ద మరమ్మతులు మొదలైన ఏర్పాటు గురించి చర్చించినట్లు తెలిపారు. ఈ ససమావేశంలో ట్రాఫిక్ ఏసీపీ నరసింహులు, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, సీఐ ప్రవీణ్ కుమార్, సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, పెద్దపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అనిల్, ఆర్ నవీన్, రామక్రిష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్పొరేట్ పాఠశాలలో
రూ.4.5 లక్షల ఫీజు స్వాహా

సొంత అకౌంట్‌లోకి ఫీజుల బదలాయింపు

గతంలో మరో కార్పొరేట్ పాఠశాలలోనూ ఇదే తరహా ఘటన

కలవర పడుతున్న పోషకులు

కోల్‌సిటీ, ఆగస్టు 20: గోదావరిఖనిలో మరో కార్పొరేట్ పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది కలిసి విద్యార్థుల ఫీజులు స్వాహా చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. రూ.4.5లక్షల ఫీజులను సదరు ప్రిన్సిపాల్ వాడుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో ఫీజులు చెల్లించేందుకు వచ్చిన పోషకుల నుంచి తమ స్కూల్ అకౌంట్ పని చేయడం లేదని తమ సొంత అకౌంట్‌లలోకి పంపాలంటూ బదలాయించుకున్నట్లు తెలుస్తున్నది. సదరు పాఠశాల యాజమాన్యం మాత్రం ఇప్పుడే తామేమి చెప్పలేమని, అన్నీ విషయాలు పరిశీలన చేస్తున్నామని పేర్కొంటున్నది.

గత సంవత్సరం గోదావరిఖని మార్కండేయకాలనీలోని ఒక ప్రముఖ కార్పొరేట్ పాఠశాలలో కూడా ప్రిన్సిపాల్ సుమారు రూ.7లక్షల వరకు విద్యార్థుల ఫీజులతో ఉడాయించిన ఘటన వెలుగు చూసింది. యాజమాన్యం ఆధారాలు చూపిన విద్యార్థుల ఫీజులను మాత్రం సర్దుబాటు చేసుకుంది. ఆధారాలు లేని వారి నుంచి మళ్లీ వసూలు చేసింది. హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తున్న కార్పొరేట్ పాఠశాలల్లో ఈ తరహా మోసాలు జరుగడం కలవరపెడుతుంది.

కొండగట్టులో భక్తుల సందడి



కొండగట్టులో అంజన్న సన్నిధిలో భక్తులు

మల్యాల, ఆగస్టు 20: కొండగట్టు అంజనేయస్వామి సన్నిధానంలో మంగళవారం సందడిగా మారింది. వేలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయంలో అభిషేకాలు చేశారు. అనంతరం భేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. నూతన వాహనాలకు భక్తులు స్వామి సన్నిధిలో వాహన పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో రామకృష్ణరావు ఇతర అధికారులు పర్యవేక్షించారు.

ఆదమరిస్తే అంతే..



రామడుగు వాగుపై ఉన్న వంతెనపై పక్కకు ఒరిగిన టిప్పర్

రామడుగు, ఆగస్టు 20: రామడుగు వాగుపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదాలు జరిగే పరిస్థితి నెలకొంది. ఈ వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో అధికారులు అప్పుడప్పుడు మొరం పోసి తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారు. భారీ వాహనాల రాకపోకలతో గుంతలు పడి దిగబడుతున్నాయి. మంగళవారం ఓ టిప్పర్ వంతనెన దాటుతూ దిగబడి పక్కకు ఒరిగింది. కొత్త వంతెన పూర్తయినా ప్రారంభించడం లేదు. ఇకనైనా కొత్త వంతెనను ప్రారంభించాలని మండల వాసులు కోరుతున్నారు.

దుబ్బపల్లిలో పేకాట స్థావరంపై దాడి

మంథనిరూరల్, ఆగస్టు 20: మంథని మండలంలోని దుబ్బపల్లి గ్రామ శివారులో పేకాట శిబిరంపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. పేకాట ఆడుతున్న సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, మంథని పోలీసులు దాడి చేయగా ఏడుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి 3 బైక్‌లు, ఏడు సెల్‌ఫోన్‌లు, రూ. 20,390 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

పిగుడుపాటుకు వ్యక్తి మృతి

మంథనిరూరల్, ఆగస్టు 20: మండలంలోని పందులపల్లికి చెందిన ఉడుత నారాయణ(52) సోమవారం రాత్రి పడుగుపాటుతో మృతి చెందినట్లు మంథని ఎస్ఐ రమేష్ మంగళవారం తెలిపారు. నారాయణ తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో పిడుగుపాటు గురై మృతిచెందినట్లు భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ తీగలతో చేపలను వేటాడిన వ్యక్తి రిమాండ్

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 20: వ్యవసాయ పొలం వద్ద ఉన్న బోరు మోటారు విద్యుత్ తీగలను అపహరించి సమీప వాగులో చేపలను వేటాడిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన కుంచం పర్శరాములపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ రమాకాంత్ మంగళవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామానికి చెందిన వట్టెల రాజు బోరు మోటారు కరెంటు తీగలను ఈ నెల 13న కుంచం పర్శరాములు దొంగిలించి సమీపంలోని వాగులో చేపలు పట్టాడు. విషయం రాజుకు తెలియడంతో విద్యుత్ తీగలను ఇవ్వాలని కుంచం పర్శరాములును కోరగా అందుకు ఆయన బెదిరింపులకు దిగాడు. కరెంటు తీగలను అపహరించడంతో పాటు విద్యుత్‌తో వాగులో చేపలను వేటాడిన కుంచం పర్శరాములుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ రమాకాంత్ పేర్కొన్నారు. నీటి వనరుల్లో విద్యుత్ షాక్‌లు పెట్టి ఎవరైనా చేపలు వేటాడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కస్టమ్ గోల్డ్ ఉచ్చులో ఖని వ్యాపారులు

రూ.10కోట్లు పోగొట్టుకున్న బాధితులు

హైదరాబాద్‌లో మోసగాళ్లను పట్టుకున్న పోలీసులు

తలలు పట్టుకుంటున్న రామగుండం వ్యాపారులు

కోల్‌సిటీ, ఆగస్టు 20: కస్టమ్స్ పట్టుకున్న బంగారం తక్కువ ధరకు ఇస్తామంటూ హైదరాబాద్‌కు చెందిన కొందరు మోసగాళ్లు పన్నిన ఉచ్చులో గోదావరిఖనికి చెందిన వ్యాపారులు పడ్డారు. సుమారు రూ.10కోట్లు పోగొట్టుకున్నట్టు తెలుస్తోంది. కస్టమ్స్ అధికారులు పట్టుకున్న బంగారంలో సగం వరకు ప్రభుత్వ లెక్కల్లో చూపరని, దానిని మధ్యవర్తుల ద్వారా తక్కువ ధరకు ఇస్తామంటూ హైదరాబాద్‌కు చెందిన కొందరు వ్యక్తులు రామగుండం ప్రాంతానికి చెందిన వ్యాపారులతో బేరాలు కుదుర్చుకున్నారు. మొదట తక్కువ మోతాదులో అసలు బంగారం ఇవ్వడంతో నమ్మిన ఈ ప్రాంత వ్యాపారులు తమకు దగ్గర ఉన్న మరికొందరు వ్యాపారులను ఈ దందాలోకి దించినట్టు తెలుస్తోంది. రెండుమూడు సార్లు ఈ విధంగా ట్రేడింగ్ చేసిన వ్యాపారులు వారికి మధ్యవర్తులుగా మారిపోయారు. దీంతో ఈ గోల్డ్ ట్రేడింగ్‌లో కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టినట్టు తెలుస్తోంది. చివరికి హైదరాబాద్ చెందిన వ్యక్తులు మకాం ఎత్తివేసి వ్యాపారులకు దొరకకుండా తప్పించుకుని తిరిగారు. వీరిని హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేయడంతో ఈ దందా వెలుగు చూసింది. రెండుమూడు స్థావరాలు ఏర్పాటు చేసుకుని నకిలీ నోట్ల కట్టలు, నకిలీ బంగారం బిస్కెట్లను ఎరగా చూపి గోదావరిఖనికి చెందిన వ్యక్తుల నుంచి భారీ ఎత్తున వసూళ్లకు పాల్పడినట్టు తెలుస్తోంది. ఇంట్లోని బంగారం, ప్లాట్లు, ఆస్తులు తాకట్టుపెట్టి తెచ్చిన డబ్బులు కూడా పెట్టుబడి పెట్టారని చర్చ జరుగుతోంది.

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి/రామడుగు/బోయినపల్లి, ఆగస్టు 20: శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. మంగళవారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 11,427 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా మిడ్ మానేరులోకి రెండు మోటార్ల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎన్టీపీసీకి, తాగునీటి అవసరాల కోసం 452 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 15.352 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ఇప్పటి వరకు 16.4 టీఎంసీల నీటిని ఎత్తిపోశారు. మిడ్ మానేరు ప్రాజెక్టులోకి 5,261 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 3150, మానేరు, మూలవాగు ద్వారా 2,111 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు ప్రస్తుతం 16.21 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది. మిడ్ మానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 3200, కుడి కాలువకు వంద క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు.

శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా పెరిగిన ఇన్‌ఫ్లో

జగిత్యాల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో రావడం మంగళ వారం కొంత పెరిగింది. ఎస్సారెస్పీలోకి 14,450 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 50.07 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు ప్రాజెక్టు నుంచి 4,453 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

కళాశాల బోధనను సద్వినియోగం చేసుకోవాలి

ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రభాకర్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రభాకర్

కొడిమ్యాల, ఆగస్టు 20 : కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధనను ఇంజనీరింగ్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. ప్రభాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలోని జేఎన్ ఆడిటోరియంలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో ఉన్న వసతులను, సౌకర్యాలను విపులంగా వివరించారు. సాంకేతిక విద్యా బోధన, పరీక్షల నిబంధనలు విద్యార్థులకు తెలిపారు. హాస్టల్‌లో ఉన్న వసతులను తెలిపారు. కళాశాలలో విద్యార్థులు పాటించాల్సిన విధానాలను, తల్లిదండ్రుల బాధ్యతలను వివరించారు. అంతకు ముందు జ్యోతి ప్రజ్వలన చేశారు. వివిధ విభాగాల అధిపతులను విద్యార్థుల తల్లిదండ్రులకు పరిచయం చేశారు. ఈ ఓరియెంటేషన్ కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు డా.. కె. శ్రీనివాస్, డా.. బి. సతీష్‌కుమార్, డా.. ఎస్. సురేష్‌కుమార్, డా.. వై. రాజశేఖర్‌రెడ్డి, డా.. సురేష్‌అర్జుల్లా, అసిస్టెంట్ రిజిస్ట్రార్ జి. దామోదర్ రెడ్డి, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాజన్న సేవలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్



నేరెళ్ల శారదకు రాజన్న ప్రసాదం అందజేస్తున్న ఈవో వినోద్‌రెడ్డి

వేములవాడ కల్చరల్, ఆగస్టు 20: వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద మంగళవారం దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి విచ్చేసిన ఆమెకు రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీస్వామి వారి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కల్యాణ మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించగా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి రాజన్న ప్రసాదం అందజేసి శేషవస్త్రం కప్పి సన్మానించారు. ఆమె వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, కనికరపు రాకేష్, సాగరం వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

కొండగట్టు అంజన్న సన్నిధిలో పూజలు

మల్యాల: రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద మంగళవారం కొండ గట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. కుటుంబసభ్యులతో వచ్చిన చైర్‌పర్సన్‌కు ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలుకగా ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆలయ ఈవో రామకృష్ణారావు శేషవస్త్రాలతో సత్కరించారు. ఆలయ అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. చైర్‌పర్సన్ వెంట ఆలయ, రెవెన్యూ అధికారులు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.



కొండగట్టులో పూర్ణకుంభతో స్వాగతం పలుకతున్న అర్చకులు

శాస్త్రీయ పద్ధతిలో విచారణ జరపాలి

- నేర పరిశోధన, నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం
- సున్నితమైన ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా పెట్టాలి
- తెలంగాణలో మావోయిస్టులు లేరు
- డీజీపీ జితేందర్



నేరసమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డీజీపీ జితేందర్

కరీంనగర్ క్రైం, ఆగస్టు 20 : కేసుల విచారణ శాస్త్రీయ పద్ధతిలో జరపాలని, నేర ఘటనలకు సంబంధించిన సాక్ష్యాధారాలను పక్కాగా సేకరించాలని రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ (డీజీపీ) డాక్టర్ జితేందర్ పోలీసు అధికారులకు సూచించారు. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో మంగళవారం కరీంనగర్ కమిషనరేట్ కేంద్రంలో డీజీపీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీజీపీ మాట్లాడుతూ కేసులు ట్రయల్స్‌కు వచ్చిన సమయంలో కేసు తీవ్రతను బట్టి అవసరమైతే డీఎస్పీలు సైతం కోర్టుకు వెళ్లి కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా వ్యవరించాలన్నారు. సీసీ కెమెరాలు నేర పరిశోధన, నియంత్రణలో కీలకంగా ఉపయోగపడతాయన్నారు. ప్రజలకు వాటి ప్రాముఖ్యతను తెలిపి అన్ని చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. డీఎస్పీ, సీఐలు, డివిజన్, సర్కిల్ వారీగా శాంతి భద్రతల సమస్యలను అధిగమించేందుకు కార్యచరణ కలిగి ఉండాలన్నారు. రౌడీషీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు, రోడ్డు ప్రమాదాలపై సమీక్ష చేశారు. మతపరమైన సమస్యలు ఏర్పడే అవకాశం ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

సమీక్షా సమావేశానికి కరీంనగర్ కమిషనరేట్ కు వచ్చిన డీజీపీ డాక్టర్ జితేందర్‌కు మల్టీ జోన్-1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి, సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్, జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్‌లు పూల మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం సాయుధ బలగాల చేత డీజీపీ గౌరవ వందనం స్వీకరించారు. సమీక్షా సమావేశంలో కరీంనగర్ పోలీస్ కమీ షనర్ అభిషేక్ మొహంతి, సిరిసిల్ల ఎస్పీ అఖిల్‌మహాజన్, జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్, వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, మూడు జిల్లాల డీఎస్పీలు, సీఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

● శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యం

రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడడమే తమ లక్ష్యమని, దాని కోసం పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని డీజీపీ డాక్టర్ జితేందర్ అన్నారు. కరీంనగర్ కమిషనరేట్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో డీజీపీ మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణ కోసం తగు చర్యలు తీసుకుంటూనే అక్రమ ఇసుక రవాణా, సైబర్ నేరాలు, డ్రగ్స్ కంట్రోల్, గంజాయి అక్రమ రవాణా, సరఫరాపై డేగ కన్నేసినట్లు తెలిపారు. భూకబ్జాలను అరికట్టడంలో అన్ని రాష్ట్రాల కంటే ముందున్నామన్నారు. ఇతర ప్రాంతాల నుంచి డ్రగ్స్ సరఫరా అవుతున్నట్లు వస్తున్న సమాచారం మేరకు అప్రమత్తమై చర్యలు తీసుకుంటున్నామన్నారు. త్వరలో సిబ్బంది కొరతను పూర్తిగా అధిగమిస్తామని అన్నారు. 13 వేల మంది ప్రస్తుతం శిక్షణలో ఉన్నారని, రెండు, మూడు నెలల్లో విధుల్లో చేరుతారని డీజీపీ తెలిపారు. గంజాయి సరఫరా చేసే వారి కదలికలపై ఆరా తీస్తున్నామన్నారు.

తెలంగాణలో గంజాయి ఉత్పత్తి లేదని, ఆంధ్రా ఒడిస్సా సరిహద్దు ప్రాంతం నుంచి సరఫరా అవుతుందన్నారు. రాష్ట్రంలో మావోయిస్టులు లేరని, ఇతర రాష్ట్రాలకు పారిపోయారన్నారు. సైబర్ క్రైం బ్యూరోను దేశంలో తెలంగాణలోనే మొదటగా ఏర్పాటు చేసి 85 కోట్ల రూపాయలు రికవరీ చేసి బాధితులకు అందజేశామన్నారు. కరీంనగర్ కమిషనరేట్‌లో కోటి 60 లక్షలు రికవరీ చేశామన్నారు. సైబర్ నేరాల్లో చిక్కుకుని డబ్బులు పోగొట్టుకున్నవారు వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1930కు ఫోన్ చేసి సమాచారం అందిస్తే నిమిషాలలో ఆ బ్యాంక్ ఖాతాను ఫ్రీజ్ చేసి ట్రాన్స్‌ఫర్ అయిన డబ్బులను వెనక్కి తీసుకువస్తామన్నారు. నార్కోటిక్ బ్యూరోను కూడా సీనియర్ అధికారులతో ఏర్పాటు చేశామన్నారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ చాలా స్ట్రిక్ట్ ఆఫీసనే విషయం తెలుసుకదా... ఈఓడబ్ల్యు కొనసాగుతుందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో కరీంనగర్ రేంజ్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతి, జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్, రాజన్న సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్, ట్రైనీ ఐపీఎస్, వేములవాడ ఏఎస్పీ శేషాద్రినీరెడ్డిలు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన మూడు జిల్లాల పోలీసు ఉన్నతాధికారులు

బీసీ గణన తర్వాతనే

'స్థానిక' ఎన్నికలు నిర్వహించాలి..

పెద్దపల్లి బీసీ సదస్సులో నాయకుల డిమాండ్..

పెద్దపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గడిచిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు తక్షణమే బీసీ గణన చేపట్టాలని, ఆ తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజూరి శ్రీనివాస్, విశ్రాంత ఐఏఎస్ అధికారి చిరంజీవి, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ డిమాండ్ చేశారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి బీసీ సదస్సును నిర్వహించారు. ముందుగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సదస్సులో బీసీ జాతీయ నాయకుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సదస్సుకు హాజరైన వారినుద్దేశించి సదరు నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలపై వివక్ష చూపుతున్నదని, దీనిని ఖండిస్తున్నామన్నారు. పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం సదస్సును ఉద్దేశించి మాట్లాడిన విశ్రాంత ఐఏఎస్ అధికారి చిరంజీవులు ఓబీసీల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను వివరించారు.

స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి నేటికీ బీసీ గణన జరగ లేదని పేర్కొన్నారు. భారతదేశాన్ని పాలించిన తెల్ల దొరలు ఓబీసీ గణన చేశారే తప్ప స్వతంత్ర భారతదేశంలో బీసీ గణనకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా బీసీ సామాజిక వర్గానికి చెందిన అనేక మంది ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ జనగణన చేస్తామని మాట ఇచ్చి కేబినెట్‌లో తీర్మానం చేసిందే తప్ప ఇప్పటి వరకు కార్యాచరణ చేపట్టలేదన్నారు. బీసీ గణన చేయకుండానే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నద్ధం అవుతున్నదని, బీసీ గణన చేపట్టే వరకు స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించవద్దని అన్నారు. బీసీల తలరాతలు మారాలంటే వెంటనే బీసీ గణన చేపట్టాలని జాజుల శ్రీనివాస్ గౌడ్, చిరంజీవులు, పుట్ట మధూకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో బీసీ జనసభ అధ్యక్షులు రాజారామ్ యాదవ్ సోషలిస్టు పార్టీ అధ్యక్షులు పిడికిలి రాజు, మాజీ జడ్పీటీసీలు గంటా రాములు యాదవ్, కందుల సంధ్యారాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్ సింగ్, బీసీ నాయకులు బండారు శ్రీనివాస్, కొలిపాక శ్రీనివాస్, మారం తిరుపతి యాదవ్, శిలారపు పర్వతాలు, మాజీ మున్సిపల్ చైర్మన్ పుట్టా శైలజ, మాజీ జడ్పీటీసీ సంపత్ యాదవ్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు నల్లవెల్లి శంకర్, పడాల రవీందర్ గౌడ్, చంద్రమౌళి, పొట్యాల మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.



జాతీయ బీసీ నాయకులకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీసీ నాయకులు

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య



మల్లేశం (ఫైల్)

ముస్తాబాద్, అగస్టు 20: రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో అప్పులబాధతో కౌలు రైతు బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాబాద్‌కు చెందిన వేముల మల్లేశం (40) మూడు సార్లు గల్ఫ్ వెళ్లి అక్కడ సరైన ఉపాధి దొరకక తిరిగి వచ్చాడు. అప్పులు తీర్చే మార్గం లేక స్థానికంగా ఐదెక రాల పొలాన్ని కౌలుకు తీసుకొని వరినాటు వేశాడు. గల్ఫ్ అప్పులు, సాగు కోసం చేసిన అప్పులు ఐదు లక్షల రూపాయలు తీర్చే మార్గం లేక అప్పుల బాధతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.మల్లేశంకు భార్య, ముగ్గురు పిల్లలున్నారు. ఎస్సై సీహెచ్ గణేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గేదెపై వీధి కుక్కల దాడి

తిమ్మాపూర్, ఆగస్టు 20: మండలంలోని మహాత్మానగర్ గ్రామంలో వీధి కుక్కలు వీరంగం వేశాయి. ఎల్ఎండీ కాలనీలోని చిందం రాజు అనే రైతు తన గేదె ను తన ఇంటి పక్కన ఉన్న తన పశువులను కట్టేశాడు. అర్ధరాత్రి సమయంలో కొన్ని వీధి కుక్కలు పశువులపై దాడి చేసి అందులో ఉన్న గేదెను హత మార్చాయి. అక్కడ ఉన్న మిగతా పశువులపై దాడి చేసేందుకు ప్రయత్నించాయి. చప్పుడు వినిపించి నిద్ర లేచిన రైతు రాజు కుక్కలను అక్కడి నుంచి వెళ్లగొట్టాడు. మృతి చెందిన గేదె విలువ 20వేల రూపాయలు ఉంటుందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని రాజు కోరాడు.

విద్యుత్‌షాక్ తో గేదె మృతి

జగిత్యాలరూరల్,ఆగస్టు 20: మండలంలోని నర్సింగాపూర్‌కు చెందిన గడ్డం మల్లయ్యకు చెందిన గేదె విద్యుత్‌షాక్‌తో మంగళవారం మృతి చెం ది నట్లు నర్సింగాపూర్ గ్రామస్థులు తెలిపారు. సోమవారం అదే గ్రామానికి చెందిన మద్దెల లచ్చన్నకు చెందిన గేదె మృతి చెందింది. రెండు రోజుల వ్యవధిలో రెండు గేదెలు విద్యుత్‌షాక్‌తో మృతి చెందడంపై గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.

చేనేత టెక్నాలజీ కోర్సులకు పిల్లలను పంపించాలి

టేస్కో జీఎం అశోక్‌రావు



సిరిసిల్లలో మాట్లాడుతున్న టేస్కో జీఎం అశోక్‌రావు

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 20 : తెలంగాణ రాష్ట్రానికి నూతనంగా మంజూరైన ఇండియన్స్ ఇన్స్టిట్యూట్ అఫ్ హాండ్లూం టెక్నాలజీలో చేనేత, టెక్స్‌టైల్ టెక్నాలజీ డిప్లొమా కోర్సుల్లో పిల్లలను చేర్పించేందుకు నేతన్నలు తమ పిల్లలను పంపించాలని టేస్కో జనరల్ మేనేజర్ అశోక్‌రావు కోరారు. సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌లోని చేనేత జౌళీ శాఖ కార్యాలయంలో మంగళవారం ఇండియన్స్ ఇన్స్టిట్యూట్ అఫ్ హ్యాడ్లూం టెక్నాలజీలో చేనేత, టెక్స్‌టైల్ టెక్నాలజీ డిప్లొమా కోర్స్‌లపై నేతన్నలకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు హాజరై మాట్లాడరు. రాష్ట్రానికి మంజూరైన దీనిలో మొదటి సంవత్సరం కోర్సులలో చదువుతోపాటు నేర్చుకునేందుకు 60 సీట్లు కేటాయించడం జరిగిందన్నారు.

ఇందులో నేర్చుకునే వారికి ఆసక్తి ఉంటే దరఖాస్తు చేసుకునేలా నేతన్నలు పిల్లలను ప్రోత్సహించాలన్నారు. ఇందులో చేరేందుకు 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారై ఉండడంతో పాటు 01-07-2024 నాటికి బీసీ, జనరల్ కేటగిరీలకు 23 సంవత్సరాలు కలిగి ఉండాలని అలాగే షెడ్యూల్డ్ కులాలకు చెందిన వారైతే 25 సంవత్సరాలు ఉన్నవారి అనుమతులు ఉంటాయన్నారు. అర్హులైన వారు ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తులను ఆన్‌లైన్‌లో చేసుకోవాలని పూర్తి వివరాల కోసం బీవైనగర్‌లోని చేనేత జౌళీ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో చేనేత జౌళీశాఖ ఏడీ మిట్టకోల సాగర్, మ్యాక్స్ సంఘాల అధ్యక్షులు, ఎస్ఎస్ఐ యూనిట్‌ల యాజమానులు, చేనేత సహకార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



పాల్గొన్న యాజమానులు, ఆసాములు

రాష్ట్ర చాంపియన్‌షిప్ సాధించిన అథ్లెట్స్

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 20: రాష్ట్ర పురుషుల, మహిళల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌ను జిల్లా క్రీడాకారులు సాధించారు. ఈనెల 17,18వ తేదీల్లో మెదక్ జిల్లాలో జరిగిన తెలంగాణ అండర్- 23 పురుషుల, మహిళల అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పాల్గొని వివిధ అంశాలలో పతకాలను సాధించారని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కడారి రవి తెలిపారు. మహిళల లాంగ్ జంప్‌లో సిహెచ్ పూజ బంగారు పతకం, వంద మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం సాధించింది. యం వినయ్ 3వేల మీటర్ల పరుగులో బంగారు పతకం, 100మీటర్ల పరుగులో కాంస్య పతకం సాధించాడు. ఇ.విష్ణువర్ధన్ 20కిలో మీటర్ల రేస్ వాక్‌లో బంగారు పతకం, కె.వైష్ణవి 400మీటర్ల పరుగుపందెంలో రజత పతకం, 2వందల మీటర్ల పరుగులో కాంస్య పతకం సాధించారు. ఎస్ అజయ్ 20కిలో మీటర్ల రేస్ వాక్‌లో రజత పతకం, కె.రవి 800మీటర్ల పరుగులో కాంస్య పతకం సాదించారు. ఎ సంతోష్ 3వేల మీటర్ల స్ట్రీపుల్ చేస్‌లో రజత పతకం, ఎ వివేకానంద ట్రిపుల్ జంప్‌లో రజత పతకం, కె స్వామి జావలెన్ త్రోలో రజత పతకం, డి. మాలుపతి 100మీటర్ల పరుగులో రజత పతకం సాదించి అండర్ 23 సంవత్సర విభాగంలో చాంపియన్‌లుగా నిలిచారని తెలిపారు. ఈ సందర్భంగా క్రీడా కారులను, వారికి శిక్షణ ఇచ్చిన కోచ్‌లు వరుణ్ కృష్ణన్, తిరుపతి లను జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు నందెల్లి మహిపాల్, డివైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, అథ్లెటిక్ అసోసియేషన్ బాధ్యులు బి.రాజగోపాలచారి, కటకం రవి, హరికిషన్, సుమన్ కళ్యాణ్, రమేష్, బిషన్‌సింగ్, కార్యదర్శి కడారి రవి అభినందించారు.



పతకాలు సాధించిన అథ్లెటిక్స్

సంక్షిప్త సమాచారం

పెద్దపల్లిటౌన్: ఎండపల్లి మండలం మారేడుపల్లిలో నిర్వహిస్తున్న ఓ క్వారీలో మృతిచెందిన కూలీ కుందన్‌కుమార్ కుటుంబానికి రూ.30లక్షల నష్టపరిహారం చెల్లించాలని దళిత బహుజన లేబర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బొంకూరి కైలాసం డిమాండ్ చేశారు. మంగళవారం పెద్దపల్లి కార్మిక శాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. మృతికి కారణమైన క్వారీని సీజ్ చేయాలని కోరారు. అలాగే సుల్తానాబాద్ గోదాంలో మరణించిన కూలీ మృతిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కండె కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లిటౌన్ : జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు హామీఇచ్చారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు మంగళవారం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ స్థలం గుర్తించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు జర్నలిస్టులకు న్యాయం జరిగేలా చూస్తామని భరోసా ఇచ్చారు. పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్ : మండలంలోని ఇదిలాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఆకతాయిలు ఆగడాలు చేస్తున్నారని ప్రధానోపాధ్యాయుడు దాసు తెలిపారు. పాఠశాల గది తాళం పగలగొట్టారని, గదుల్లో, ఆవరణలో కూల్‌డ్రింక్ బాటిల్స్, ఖారా ప్యాకెట్లు చెల్లాచెదురుగా పడి ఉన్నాయన్నారు. కొందరు ఆకతాయిలు పాఠశాల లేని సమయంలో ఆవరణలో మద్యం సేవిస్తున్నట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. విషయంపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

మంథని : విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు ఫోరం చైర్మన్ ఎన్‌వీ వేణుగోపాలచారి ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఎల్‌బీ గార్డెన్స్‌లో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఓవర్‌లోడ్, ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు, డ్యామేజీ ఫోల్స్ అదనపు వైర్లు, సర్వీస్ పేరు మార్పిడి అంశాలకు సంబంధించి 8మంది వినియోగదారులు ఫిర్యాదు చేయగా వాటిని నమోదు చేసి పరిష్కరించాలని అధికారులను చైర్మన్ ఆదేశించారు. సీజీఆర్ఎఫ్ ఉద్యోగులు, ఎస్ఈ సుదర్శనం, డీఈ ఈశ్వర్‌ప్రసాద్, ఏడీఈ, ఏఈలు సీహెచ్. మల్లయ్య, శ్రీధర్, హనుమాన్‌దాస్, సతీష్, రాజేందర్‌లు పాల్గొన్నారు.

మంథని : ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణకు వ్యతిరేకంగా బుధవారం భారత్ బంద్‌ను నిర్వహిస్తున్నట్లు మాల మహానాడు నేతలు దాసరి దశరథం, నూకల బానయ్యలు తెలిపారు. మంగళవారం వారు ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. అప్పాల పోచయ్య, బడ్డెల ఆనంద్, రాదండి శంకర్, జంజర్ల శ్రీనివాస్ జంజర్ల రాజు, దాసరి గట్టయ్య, బడికెల నర్సయ్య, ఆర్ల జ్ఞాని, సుంకే రాంమూర్తి పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్ : ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ బుధవారం తలపెట్టిన భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని మాల మహానాడు నాయకులు దాసరి దశరథం పిలుపునిచ్చారు. మంగళవారం గోదావరిఖని చౌరస్తాలో బంద్‌ను విజయవంతం చేయాలంటూ నిరసన చేపట్టారు. పిట్టల వెంకటి, నంది నగేష్, ఎరుకల లింగమూర్తి, లక్ష్మణ్‌రావు, పోషం, బొమ్మక వెంకటేశ్వర్లు, మాలెం మధు, దాసరి రమేష్, సోగాల వెంకటి, కుమార్ పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్ : దళిత మహిళపై దాడి చేసి కులం పేరుతో దూషించిన మద్ది ఎల్లయ్య,అతని అనుచరులపై చర్యలు తీసుకోవాలని, మహిళా హక్కుల పోరాట సమితి అధ్యక్షురాలు సంటి రామలక్ష్మి డిమాండ్ చేశారు. మంగళవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ జీడీకే 1ఇంక్లైన్‌లో పనిచేస్తున్న జనగామ స్వప్నపై మద్ది ఎల్లయ్య, అతని అనుచరులు దాడి చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో పోతన విజయ, దొరగాండ్ల కమల, మల్లమ్మ, సునీత, అరుణ, అంజమ్మ పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్ : మండలంలోని రాఘవపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని దర్గాలో సీజనల్ వ్యాధుల దృష్ట్యా జ్వరాలు తీవ్రం కావడంతో మంగళవారం రాఘవపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు సింధూష మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో ఫయాజ్, పంచాయతీ కార్యదర్శి రవి, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్ : మండలంలోని గౌరెడ్డిపేటలో బురదమయమైన రోడ్డు అనే కథనం మంగళవారం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. డీఎల్‌పీవో వేణుగోపాల్ రోడ్డును పరిశీలించారు. బురద లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎంపీవో ఫయాజ్, పంచాయతీకార్యదర్శి తిరుపతి పాల్గొన్నారు.

కమాన్‌పూర్ : మండల వ్యవసాయాధికారిగా గిరి రామకృష్ణ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం నుంచి రామకృష్ణ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఏవోగా పనిచేసిన ప్రమోద్ కుమార్ పాలకుర్తి మండలానికి బదిలీ అయ్యారు.

మంథని : మంథని, ముత్తారం మండలాల్లో నూతనంగా తోటగోపయ్యపల్లి, జిల్లెలపల్లి గ్రామాలు నూతన గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేయడంపై మాజీ జడ్పీటీసీలు, ఎంపీపీలు తగరం సుమలత, జక్కుల ముత్తయ్య, నేతలు ఏగోళపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, పి. కిషన్‌రెడ్డి, గుజ్జుల రాజిరెడ్డి, నూనె కుమార్, రవీందర్‌రావులు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. నూతన గ్రామ పంచాయతీల మంజూరు కోసం గతంలో కృషి చేసిన బీఆర్ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి,మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి



ఖనిలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



ధర్మారంలో నివాళులర్పిస్తున్న ప్రభుత్వవిప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 20: దేశం కోసం ప్రాణాలర్పించిన సేవలు మరువలేనివని రామగుండం ఎమ్మెల్యే మకాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా గోదావరిఖని రాజీవ్ రహదారి పైగల రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తన చివరి శ్వాస వరకు దేశం కోసం కృషి చేశారని, గాంధీ వారసత్వాన్ని పుచ్చుకుని దేశాన్ని ప్రగతి బాటలో నడిపించారని, సాంకేతిక విప్లవం ద్వారా భారత దేశాన్ని ప్రపంచ దేశాలతో పోటీ పడే విధంగా తయారుచేశారన్నారు. ఐటీ రంగంలో హైదరాబాద్‌ను కేంద్రంగా చేసి ప్రపంచ దేశాలతో పోటీ పడేవిధంగా ముందుకు సాగాలని తపన పడ్డారని, రాజీవ్‌గాంధీ సూచించిన మార్గంలో యువత నడవాలని పిలుపునిచ్చారు. రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో ఐటీకి పునాదులు వేసి విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిద్దారన్నారు. నగర అధ్యక్షులు బొంతల రాజేష్, పట్టణ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మేయర్ బంగి అనీల్‌కుమార్, కాల్వ లింగస్వామి, కార్పొరేటర్లు మహంకాళి స్వామి, ఎండీ ముస్తాఫా, బాల రాజ్‌కుమార్, శంకర్ నాయక్, దొంత శ్రీనివాస్, నాయకులు పెద్దెల్లి ప్రకాష్, బొమ్మక రాజేష్, కొప్పుల శంకర్, నాయిని ఓదెలు, దీటి బాలరాజు, చుక్కల శ్రీనివాస్, కల్వల సంజీవ్, దాసరి ఉమ, సాంబమూర్తి, నాజీమొద్దీన్, దాసరి విజయ్, మాలెం మధు, బొంతల లచ్చన్న, మీసాల సతీష్, మిడిదొడ్డి ప్రవీణ్, సురేష్, రాజు, ఆడెపు రవి, అనుమ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎలిగేడు : మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో బుధవారం మాజీ దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు దుగ్యాల సంతోష్‌రావు, కోరుకంటి వెంకటేశ్వరరావు, తాటిపల్లి రమేష్‌బాబు, పోల్సాని పుల్లారావు, కొండ తిరుపతిగౌడ్, అమ్ముల రాజు, రమేష్, ఓదెలు, బాలసాని పర్శరాంగౌడ్, పడాల పర్శరాంగౌడ్, పల్లెర్ల వెంకటేష్‌గౌడ్, బడే స్వామి, శంకర్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్ : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి స్వీట్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఎండీ మునీర్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సౌన్నాయి టెంకం శివరామకృష్ణ, గ్రామ శాఖ అధ్యక్షుడు అల్లం దేవేందర్, మాజీ సర్పంచ్ మాదాసి సతీష్, సబ్బని రాజమల్లు, గీస రాజయ్య, ఆషాడపు సురేష్, జిన్న రామచంద్రారెడ్డి, వడ్లూరి సాగర్, కల్వల శ్యామ్, నేదురి రమేష్, తాండ్ర మల్లయ్య, గోవర్ధన్ ఎనగంటి రవి, మల్లేష్, బండి శ్రీధర్, మోటం రాజశేఖర్, రామచంద్రం, చింతల ప్రకాష్, రాసకట్ల చంద్రమౌళి,రాసమల్ల ఇస్తారి, తుండ్ల రాజు, చెవుల రాజయ్య పాల్గొన్నారు.

ముత్తారం : మండల కేంద్రంలో మాజీ ప్రధాని స్వర్గీయా రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళి అర్పించారు. రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవాలను గుర్తుచేసుకున్నారు. రాజీవ్‌గాంధీ అమర్ రహే అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బియ్యాని శివకుమార్, బక్కతట్ల వినీత్, రఫీ, సమ్మయ్య, చంద్రమౌళి, రమేశ్, విజయ్, సంజీవ్‌రెడ్డి, వెల్మరెడ్డి, వీరగోని అంజి, ప్రశాంత్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ : దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని మంగళవారం కాలనీ కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. తెలంగాణ చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం కేక్ కట్ చేశారు. దేశం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పురోభివృద్ధి వెనక రాజీవ్‌గాంధీ వేసిన పునాదులే కారణమని నాయకులు పేర్కొన్నారు. దేశానికి, పార్టీకి ఆయన చేసిన సేవలను నాయకులు కొనియాడారు. ఈకార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు గుండేటి రాజేష్, నాయకులు మారెల్లి రాజిరెడ్డి, జక్కుల దామోదర్ రావు, సత్యనారాయణరెడ్డి, దశరథం గౌడ్, దేవనపల్లి చక్రపాణి, అవినాష్ పాల్గొన్నారు.

ధర్మారం : మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ చేసిన సేవలు మరవలేనివని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మంగళవారం ధర్మారంలో రాజీవ్‌గాంధీ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారతదేశానికి అత్యంత పిన్న వయస్సులో ప్రధాన మంత్రిగా డిజిటల్ రంగంలోకి దూసుకువెళ్లాడని ఆయన గుర్తు చేశారు. రాజీవ్‌గాంధీ హయాంలోనే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, మార్కెట్ చైర్మన్ రూప్లానాయక్, డైరెక్టర్ కాంపెల్లి రాజేశం, నాయకులు బొల్లి స్వామి, దేవి జనార్దన్, కాడె సూర్యానారాయణ. పాలకుర్తి రాజేశం, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్ : దేశ మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు మంగళవారం మండల కేంద్రంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధానకార్యదర్శి మల్యాల తిరుపతి, నాయకులు దాసరి గట్టయ్య, అబ్దుల్ రఫీక్, నగునూరి నర్సయ్య, గెల్లు లింగయ్య, చాట్ల గట్టయ్య, భూంపెల్లి రాజయ్య, అనవేన లక్ష్మీ రాజం, మల్యాల చిన్న తిరుపతి, దాసరి రాంచందర్, స్వామ్రాట్, గర్రెపల్లి వెన్న, చాట్ల రాయమల్లు, స్వామి, కనకయ్య, రామస్వామి, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.



కాల్వశ్రీరాంపూర్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు



యైటింక్లయిన్‌కాలనీలో నివాళులు అర్పిస్తున్న నాయకులు

రైతుల కోసమే పోరాటాలు, ఆందోళనలు..

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న న్యాయవాదులు

సుల్తానాబాద్, ఆగస్టు 20: తన రెండున్నర దశాబ్దాల రాజకీయ జీవితంలో ఎక్కువగా రైతుల సమస్యల కోసమే పోరాటాలు, ఆందోళనలు చేశానని, తద్వారా రైతులకు న్యాయం జరిగేలా చేశానని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. గతంలో నమోదై ఉన్న పలు కేసులకు సంబంధించి ఎమ్మెల్యే విజయరమణారావు మంగళవారం సుల్తానాబాద్ కోర్టు వాయిదాకు హాజరయ్యారు. ఆయనతో పాటు మరో పదిమంది నాయకులు కూడా హాజరయ్యారు. కేసుకు సంబంధించిన వాయిదా కోసం వారు మెజిస్ట్రేట్ ఎదుట హాజరయ్యారు. అనంతరం ఆయన కోర్టు ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ ఆనాటి కేసుల గురించి వివరించారు. పెద్దపల్లి నియోజకవర్గంలో సాగునీటి కోసం రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని, పంటలు కోల్పోయే ప్రమాదం ఉన్న సమయంతో తాను కాలువ నీటి కోసం అనేక ఆందోళనలు పోరాటాలు చేశానని, ఇందులో భాగంగా రాస్తారోకోలు ధర్నాలు, ఎస్సారెస్పీ ఆఫీసు ముట్టడి, నీటి విడుదల కోసం గేట్ల ఎత్తివేత వంటి ఆందోళనలు చేసి అనాటి ప్రభుత్వాలపై, అధికారులపై ఒత్తిడి తెచ్చి చివరకు కాలువ నీటిని విడుదల చేయించి రైతుల పంటలు కాపాడనని, తనపై మాత్రం పోలీసులు కేసులు నమోదు చేశారన్నారు. అయినా రైతులకు న్యాయం చేశానన్న సంతృప్తి మిగిలిపోయిందన్నారు. ఇప్పటికి కూడా రైతుల పక్షపాతినేనని, వారికి రెండు లక్షల సంపూర్ణ రుణ మాఫీ జరిగేలా కృషి చేస్తానన్నారు. సాంకేతిక కారణాల వలన మాఫీ కాని వారు ఎలాంటి ఆందోళన చెందవద్దని అన్నారు. ఆయన వెంట నాయకులు గాజుల రాజమల్లు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు వేగోలం అబ్బయ్యగౌడ్, బిరుదు క్రిష్ణ, మండల శాఖ అధ్యక్షుడు చిలుక సతీష్, సీనియర్ నాయకులు కల్లెపల్లి జానీ, కుమార్ కిషోర్, గరిగె శ్రీనివాస్, రఫీ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన న్యాయవాదులు..

సుల్తానాబాద్ కోర్టుకు హాజరైన ఎమ్మెల్యే విజయరమణారావును బార్ అసోసియేషన్ ఆఫీసులు న్యాయవాదులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పడాల శ్రీరాములు, బాలకిషన్ ప్రసాద్, ఆవుల లక్ష్మీరాజంయాదవ్, వొడ్నాల రవీందర్, దూడం ఆంజనేయులు, రాజేంద్రప్రసాద్ తదితరులు ఉన్నారు.



ఆర్జీ-3, ఏపీఏ పర్సనల్ అధికారిగా సుదర్శనం

రామగిరి, ఆగస్టు 20: సింగరేణి ఆర్జీ-3, ఏపీఏ డివిజన్‌లకు పర్సనల్ అధికారిగా సుదర్శనం మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. డివిజన్‌లో పని చేసిన రవీందర్‌రెడ్డి ఆర్జీ-1 డివిజన్‌కు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో శ్రీరాంపూర్ సూపర్‌బజార్‌లో డివిజన్ మేనేజర్‌గా పనిచేసిన సుదర్శనం ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు చేతుల మీదుగా బాధ్యతలు స్వీకరించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 20: సెక్టార్-3 డిస్పెన్సరీలో మంగళవారం సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ పద్మ, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ సాహితి పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలి

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 20: సింగరేణిలో దీర్ఘకాలిక సమస్యలను యాజమాన్యం పరిష్కరించాలని సీఐటీయూ ఆర్జీ- 2 బ్రాంచి కార్యదర్శి కుంట ప్రవీణ్ డిమాండ్ చేశారు. మంగళవారం వీకేపీ గనిలో జరిగిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి ఎనిమిది నెలలు గడుస్తున్నా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఈనెల 20 నుంచి ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు, ఆందోళనలకు కార్మికులు కలిసిరావాలని పిలుపునిచ్చారు. ఉల్లి మొగిలి, ఎస్ వెంకన్న, శ్రవణ్, వినేష్, రమేష్ పాల్గొన్నారు.

మేడిపల్లి ఓసీపీలో స్క్రాప్ చోరీ

కోల్‌సిటీ, ఆగస్టు 20: మేడిపల్లి ఓసీపీలో స్క్రాప్ చోరీ జరిగిన ఘటన వెలుగుచూసింది. కారులో స్క్రాప్ తరలిస్తుండగా సోమవారం సెక్యూరిటీ సిబ్బంది పట్టుకున్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఒక సెక్యూరిటీ ఉద్యోగి సహకారంతోనే ఈ చోరీ జరిగినట్టు గుర్తించారు.

మహిళా కార్మికురాలిపై దాడిని ఖండించండి

- సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్

గోదావరిఖని, ఆగస్టు 20: సింగరేణి ఆర్జీ-1లోని వన్‌ఇంక్లయిన్‌లో పనిచేస్తున్న మహిళా కార్మికురాలు స్వప్నపై ఏఐటీయూసీ గూండాలు దాడి చేయడం అమానుషమని, ఆ దాడిని కార్మికవర్గం ఖండించాలని భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సింగరేణిలో గోలేటి నుంచి కొత్తగూడెం వరకు అధికారుల నుంచి యూనియన్ నాయకుల వరకు పురుషాధిక్య అహంకారంతో పెట్రేగి పోతున్నారని, అందుకు నిదర్శనం ఇలాంటి దాడులేనని తెలిపారు. స్వప్నపై దాడి చేసిన ఏఐటీయూసీ గూండా మద్ది ఎల్లయ్య, సింగరేణిలో పనిచేస్తున్న అతని కొడుకు, మరి కొంతమంది స్థానిక ఏఐటీయూసీ గూండాలు ఆమెపై అసభ్యకరంగా ప్రవర్తించారని పేర్కొన్నారు. మహిళా కార్మికులపై అనైతికమైన దుష్ప్రచారాలను చేస్తూ వేధింపులకు పాల్పడుతున్నారని, ఐఎన్‌టీయూసీ దళిత మహిళా నాయకురాలుగా తనదైన రీతిలో కార్మిక సమస్యలపై స్పందించే స్వప్న కాంగ్రెస్ పార్టీ, ఐఎన్‌టీయూసీ అవకాశవాద బ్రాహ్మణీయ ఫాసిస్టు నాయకుల కుట్రలకు బలవుతోందని పేర్కొన్నారు. ఆనాటి నుంచి నేటి వరకు ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీలు మహిళా కార్మికుల పట్ల మోసపూరితమైన దిగజారుడు వైఖరేనని, ఈ రెండు సంఘాల నాయకులు నాణానికి బొమ్మ, బొరుసు లాంటి వారేనని తెలిపారు. ఐఎన్‌టీయూసీలో కొనసాగుతున్న దళిత బహుజన కార్మికులు, అగ్రవర్ణ బ్రాహ్మణ ఆధిపత్యానికి దోహదం చేస్తూ అక్రమ దందాలకు పాల్పడుతూ నాయకుల మెప్పుల కోసం దిగజారుతూ బ్రోకర్ పనులు చేస్తున్నారని పేర్కొన్నారు. కార్మికవర్గం తిరుగుబాటుతో సద్దుమణిగిన మహిళా కార్మికులపై వేధింపులు దాడులు, గూండాగిరి టీబీజీకేఎస్ కాలం నుంచి తిరిగి పెట్రేగి ఏఐటీయూసీ నాయకుల గుండాగిరితో రోజురోజుకు జీవం పోసుకుంటోందని పేర్కొన్నారు. అధికారులకు ఫిర్యాదు చేస్తే న్యాయం చేయడం మాని వేధింపుల ప్రశ్నలతో సూటిపోటి మాటలతో అవమానాలకు గురిచేస్తూ వేధింపులకు పాల్పడ్డ వారిని కాపాడే పక్షపాతంగా అధికారులు, నాయకులు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో కార్మికులు, ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, మహిళా సంఘాలు, ప్రెస్, మీడియా సింగరేణిలోని మహిళా కార్మికులకు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. స్వప్నపై దాడి చేసిన ఏఐటీయూసీ గూండాల వైఖరిపై అధికార పార్టీ రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ స్పందించకపోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. ఎమ్మెల్యే అవకాశవాద ఓట్ల రాజకీయాలు, దళిత మహిళా కార్యకర్తల పట్ల ఉన్న ఉదాసీన వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు. స్వప్నపై దాడి చేసిన మద్ది ఎల్లయ్య, అతని అనుచర ఏఐటీయూసీ గూండాలు వారి పద్ధతిని మార్చుకోవాలని ప్రభాత్ హెచ్చరించారు. పోలీసులు పక్షపాతంగా వ్యవహరించడం మానుకోవాలని, మహిళా కార్మికురాలుకు అన్యాయం చేయాలని చూస్తే ఎమ్మెల్యే, ఐఎన్‌టీయూసీ నాయకులకు గుణపాఠం తప్పదని ప్రభాత్ ప్రకటనలో హెచ్చరించారు.

ఫారెస్ట్ అధికారికి వీడ్కోలు సన్మానం

రామగిరి, ఆగస్టు 20: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్‌లో ఫారెస్ట్ అధికారిగా పనిచేసిన బానోతు కర్ణకు మంగళవారం ఘనంగా వీడ్కోలు సన్మానం నిర్వహించారు. ఈ జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు, ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధికారులు రఘుపతి, సత్యనారయణ, శేఖర్‌బాబు, యాదయ్య, శ్రీనివాసులు, వెంకటరమణ, చంద్రశేఖర్, సుధాకర్, జనార్దన్, ఐలయ్య, శ్రీనివాస్, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ఫారెస్ట్ అధికారిని సన్మానిస్తున్న అధికారులు

వైభవంగా మైసమ్మ బోనాలు



బోనం ఎత్తుకున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 20: గోదావరిఖని కూరగాయల మార్కెట్‌లో మంగళవారం మైసమ్మతల్లి పట్నాలు, బోనాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ హాజరై మైసమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నెత్తిన బోనం ఎత్తుకుని ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండం ప్రజలను మైసమ్మ తల్లి చల్లగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేష్, కార్పొరేటర్ మహంకాళి స్వామి, నాయకులు పెద్దెల్లి ప్రకాష్, తిప్పారపు శ్రీనివాస్, బొమ్మక రాజేష్, నాయిని ఓదెలు, కళ్యాణి సింహాచలం, ఆడెపు దశరథం పాలొన్నారు.

నిజాయితీని చాటుకున్న రిటైర్డ్ కార్మికుడు

-పోగొట్టుకున్న బంగారు గాజు మహిళకు అప్పగింత

రామగిరి, ఆగస్టు 20: బంగారు గాజు పోగొట్టుకున్న మహిళకు తిరిగి ఇచ్చి తన నిజాయితీని చాటుకున్నాడు ఓ రిటైర్డ్ కార్మికుడు. మండలంలోని రత్నాపూర్ గ్రామానికి చెందిన శంకరయ్య స్థానిక రామాలయంలో సేవకుడిగా పనిచేస్తున్నాడు. మంగళవారం రామాలయంలో సెంటినరీ కాలనీకి చెందిన భక్తురాలు పూజలను ముగించుకొని తన క్వార్టర్స్‌కు వెళ్లింది. మార్గం మధ్యలో తన చేతికి ఉన్న 80వేల రూపాయల విలువ గల బంగారు గాజు పోగొట్టుకుంది. అదేమార్గంలో ఇంటికి వెళ్తున్న శంకరయ్యకు పన్నూర్ సెంటర్‌లో దొరికిన బంగారు గాజును తీసుకొని స్థానికంగా ఎవరూ కనిపించకపోవడంతో ఇంటికి తనతో తీసికెళ్లాడు. శంకరయ్య వద్ద గాజు ఉన్నట్లు తెలుసుకున్న మహిళ అతడి వద్దకు వెళ్లగా తిరిగి అందించాడు.

కాంగ్రెస్ హయాంలోనే పేదలకు సంక్షేమ పథకాలు

ముత్తారం, ఆగస్టు 20: కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని మాజీ యూత్ మండల పార్టీ అధ్యక్షుడు బియ్యాని శివకుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రలోని కాసర్లగడ్డ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 8 నెలల కాలంలో రైతులకు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు, ఉచిత విద్యుత్, ఓడెడ్-గంగాపూర్‌కి సంబంధించిన రోడ్డుకు ఎస్టిమెట్ వేసి రోడ్డు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు బక్క తట్ల వీనిత్, తుటి రవీ, సమ్మయ్య, రామస్వామి, రమేశ్, సంజీవ్‌రెడ్డి, వెలమరెడ్డి, ప్రశాంత్, శంకర్, అంజి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

స్వీపర్‌ను అవమానించిన వైద్యుడిపై చర్య తీసుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయీబ్రాహ్మణులు

మంథని, ఆగస్టు 20: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో స్వీపర్‌గా పని చేస్తున్న విష్ణుభక్తుల పూర్ణిమను అవమానపర్చే విధంగా తన బూట్లు తుడిపించుకున్న డాక్టర్ రాజశేఖర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానిక అంబేద్కర్ చౌక్‌లో మంథని నాయీబ్రాహ్మణ సేవా సంఘం, సీపీఐ నేతలు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని, బాధితురాలు పూర్ణిమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ఈమేరకు ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి ఏవో తూము రవీందర్‌కు వినతిపత్రం ఇచ్చారు. డాక్టర్‌పై చర్యలు తీసుకోకపోతే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బొమ్మకంటి మల్లేష్, నేతలు మంథని సురేష్, ఇనుముల సతీష్, సాయి, సీఐటీయూ నేతలు బూడిద గణేష్, ఏల్పుల సురేష్, ఆర్ల సందీప్, విష్ణుభక్తుల రఘు, మంథని లక్ష్మణ్‌లు పాల్గొన్నారు.

నేత్ర దానం

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 20: మరణించిన తమ తండ్రి నేత్రాలను మరొకరి జీవితంలో వెలుగు నింపాలనే సమాజహితం కాక్షించి నేత్రదానం చేశారు బొగ్గుల చిన్నయ్య కుటుంబ సభ్యులు. అల్లూరుకు చెందిన కాంగ్రెస్ నాయకుడు బొగ్గుల చిన్నయ్య అనారోగ్య సమస్యలతో మంగళవారం మృతి చెందాడు. సదాశయ ఫౌండేషన్ సభ్యులు నేత్రదానంపై అవగాహన కల్పించడంతో చిన్నయ్య నేత్రాలను దానం చేసేందుకు ఆయకు కుటుంబ సభ్యులు అంగీకరించారు. ఎల్వీ ప్రసాద్ ఐబ్యాంక్ సిబ్బంది ఆయన నేత్రాలను సేకరించి ఐబ్యాంక్‌కు తరలించారు. విషాదంలోనూ మరో ఇద్దరి అంధుల జీవితాల్లో వెలుగులు నింపాలనే ఉద్దేశంతో నేత్ర దానా నికి అంగీకారం తెలిపిన చిన్నయ్య కుటుంబ సభ్యులను సదాశయ ఫౌండేషన్ సభ్యులు అభినందనలు తెలిపారు.

వార్డుల వారీగా ఓటరు జాబితా తయారు చేయాలి

జూలపల్లి, ఆగస్టు 20: త్వరలో జరగబోయే గ్రామపంచాయతీ ఎన్నికలకు ఓటరు జాబితాను వార్డుల వారీగా విభజన చేసి, జాబితాలోని తప్పొప్పులను సవరణ చేసేందుకు కృషి చేయాలని మండలపరిషత్ అభివృద్ధి అధికారి పద్మజ అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌వోలు అంగన్‌వాడీ టీచర్లు, కారోబార్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో పద్మజ మాట్లాడుతూ ప్రత్యేకంగా ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌ఓలు కలిసి గ్రామాల్లోని ఓటరు జాబితాలను పరిశీలించాలన్నారు. ఎలాంటి తప్పులు దొర్లకుండా వార్డుల వారీగా విభజన చేసి పంచాయతీ ఎన్నికలకు సిద్ధం చేయాలని ఎంపీడీవో సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపీవో అనిల్‌రెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ కిరన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'రుణమాఫీ కాని రైతులు దరఖాస్తులు అందజేయాలి'

జూలపల్లి, ఆగస్టు 20: మండలంలో రుణమాఫీ కాని రైతులు తమ దరఖాస్తులను వడుకాపూర్, తేలుకుంట, అబ్బాపూర్ గ్రామాల్లో గల రైతువేదికలలో అందుబాటులో ఉన్న వ్యవసాయ విస్తరణ అధికారులకు అందజేయాలని మండల వ్యవసాయ అధికారి ప్రత్యూష రైతులకు సూచించారు. మండలంలోని తెలుకుంట రైతువేదికలో మంగళవారం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమే మాట్లాడుతూ రుణమాఫీ కాని రైతులు ఎవరైనా ఉంటే తమ పూర్తి కుటుంబ సభ్యుల వివరాలతో భూమి పట్టాదార్ పాస్‌బుక్, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్స్ జిరాక్సు కాపీలను అందించాలని రైతులకు సూచించారు. అనంతరం రైతువేదికలో దరఖాస్తులను ఆమె స్వీకరించారు. ఈకార్యక్రమంలో ఏఈవో కిరణ్మయి పాల్గొన్నారు.

23 నుంచి పాఠశాల స్థాయి క్రీడా పోటీలు

ఓదెల, ఆగస్టు 20: మండలంలోని పొత్కపల్లి హైస్కూల్లో ఈనెల 23 నుంచి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పాఠశాల స్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎంఈవో రాజయ్య తెలిపారు. పొత్కపల్లి హైస్కూల్‌లో మంగళవారం ఎస్‌జీఎఫ్ క్రీడల నిర్వహణ సమావేశాన్ని ఎంఈఓ రాజయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ మేరకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్ క్రీడలను నిర్వహించేందుకు తీర్మానించారు. 23న బాలురు, 24న బాలికల క్రీడలు ఉంటాయని తెలిపారు. ఇందులో పాల్గొనే విద్యార్థులు అండర్-17 జనవరి ఒకటి 2008 తర్వాత, అలాగే అండర్-14 విద్యార్థులు జనవరి ఒకటి 2011 తర్వాత జన్మించినవారై ఉండాలని తెలిపారు. కబడ్డీ క్రీడాకారులు అండర్-14 బాలురు 51కిలోలు, బాలికలు 48కిలోల బరువు ఉండాలన్నారు. అండర్-17 బాలురు 57 కిలోలు ఉండాలన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు పుట్టిన తేదీ, స్టడీ సర్టిఫికెట్స్‌తో రావాలని ఎంఈవో కోరారు. వివరాలకు 9908716070 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య, పీడీలు హరికృష్ణ, విష్ణు, రాజేందర్ రెడ్డి, సదానందం, స్వరూప, కుమారస్వామి పాల్గొన్నారు.